

చిన్నారులకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణానికి చెందిన చిన్నారులు తమ నాట్య ప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అద్భుతాలు సష్టిస్తూ పట్టణానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. పట్టణంలోని శ్రీ నటరాజ నాట్యమండలి, సరస్వతీ నిలయం విద్యార్థులు ప్రతిష్టాత్మక "నోబెల్ వరల్డ్ రికార్డ్స్" లో స్థానం సంపాదించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఘనత సాధించిన చిన్నారులను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారంపార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా అబి.నందించారు. అద్భుత నాట్య ప్రదర్శన చేసిన చిన్నారులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సర్టిఫికెట్లు, షీల్డులు అందజేసి ఆశీర్వదించారు.

ఆ కూడలి.. ప్రమాదకరం..!

జాతీయం రహదారి నిర్మిం చారు.. అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించడం మరి చారు. దీంతో ప్రజలు రోడ్డు దాటేందుకు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. కందుకూరు పట్టణంలోని మాల్యాద్రి కాలనీ నుంచి కొనసాగే జాతీయ రహదారి వెంట దివివారిపాలెం, చుట్టుగుంట, ఆనందపరం, కొండముడుసుపాలెం తోపాటు పలు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కొండముడుసుపాలెం వద్దనున్న జాతీయ రహదారి కూడలి వద్ద సమస్య తీవ్రంగా ఉంది. అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేయాలని ప్రజలు ఉద్య మించినా ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో చలనం లేక పోవడం గమనార్హం.

- జాతీయ రహదారిలో వాహనాల రద్దీ
- అండర్ పాస్ బ్రిడ్జిలు లేక ప్రయాణికుల అవస్థలు
- నిత్యం రోడ్డు ప్రమాదాలు
- ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ప్రయాణం..

ప్రజాశక్తి-కందుకూరు

నూతనంగా వినియోగంలోకి వచ్చిన మైదుకూరు-సింగరాయకొండ జాతీయ రహదారి కందుకూరుకు సమీపంలో ఉన్న కొండముడుసుపాలెం గ్రామం వద్ద నుంచి వెళ్తోంది. ఆ గ్రామం వద్దనే కందుకూరు నుంచి కావలి వెళ్లే రహదారి కలుస్తోంది. దీంతో జాతీయ రహదారి కొండముడుసుపాలెం వద్ద నాలుగు రోడ్ల కూడలిగా మారింది. ఆ జాతీయ రహదారికి అక్కడ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించలేదు. దీంతో వాహనాల రాకపోకలకుఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి పనులు పూర్తి_కావడంతో వాహనాలను వదిలారు. ఆ వాహనాలు సింగరాయకొండ నుంచి నేరుగా పామూరు వైపు వెళ్తాయి. అతివేగంగా వాహనాలు తిరుగుతున్నాయి. కొండముడుసుపాలెం వద్దకు రాగానే వాహనాలు వేగాన్ని తగ్గించుకుని వెళ్లాల్సిన పరిస్థితి.. మరోవైపు కందుకూరు నుంచి కావలి వెళ్లే వాహనాలు నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్య వస్తోంది. వాహనదారులు ఏమాత్రం చూడకుండా ఆ నాలుగు రోడ్ల కూడలిలో ప్రయాణం చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కందుకూరు నుంచి కొండముడుసుపాలెం మీదుగా వెళ్లే రహదారికి అను సంధానంగా కందుకూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల గ్రామాలు ఉన్నాయి. కందుకూరు, గుడ్లూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల గ్రామాల తో పాటు కావలికి కూడా ఈ రోడ్డు మీద నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. నిత్యం వందలాది వాహనాలుతో పాటు 20 వేలకు పైగా జనం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డు ను కలిపే కొండముడుసుపాలెం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయలేదు. జాతీయ రహదారి నిర్మాణం చేసే సందర్భంగా డిజైన్ చేసిన ఇంజినీరింగ్ అధికారులు కీనస ఆలోచన లేకుండా రోడ్డు నిర్మించారు. డిజైన్‌లో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని ఆలోచన వారికి రాలేదు. జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు ప్రారంభం కావడంతో అండర్ పాస్ బ్రిడ్జి అవసరాన్ని కొండముడుసుపాలెం ప్రజలు గుర్తించారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. సబ్ కలెక్టర్ తో పాటు రెవెన్యూ ,రోడ్లు భవనాల శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఇక్కడ 100అండర్ పాస్ బ్రిడ్జి అవసరమని ప్రజల కోరికకు మద్దతుగా సిపిఎం, సిపిఐ నిరసన తెలిపాయి. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించి తీరాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. ప్రజల కోరికను ఉన్నత స్థాయి అది . కారులకు తెలియజేస్తామని ఆందోళన కార్యక్రమాలను చేయవద్దని కందుకూరు సబ్ కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులుచెప్పారు. ఆ హామీలు ఏడాది గడుస్తున్న అమలు కాలేదు. నిర్మాణానికి ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని వాహనం దారులు కొండముడసుపాలెం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

కొండముడుసు పాలెం వద్ద కూడలి..

నిత్యం ప్రమాదాలు..

జాతీయ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత వాహనదారులు అతివేగంగా రావడంతో ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. చుట్టుగుంట గ్రామ అడ్డరోడ్డు వద్ద వలేటి వారిపాలెంకు చెందిన ఓ కుటుంబం కారులో ప్రయాణిస్తూ అదుపుతప్పి రోడ్డు కిందకి పడటంతో భార్య మతి చెందింది. భర్త తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. దివివారిపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయాడు. కందుకూరు వైశ్య కాలనీకి చెందిన 45 ఏళ్ల వ్యక్తి ఈ రోడ్డుపై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అండర్ పాస్ బ్రిడ్జిలు లేకపోవడమే. కందుకూరు పట్టణం మాల్యాద్రి కాలనీ నుంచి కొనసాగే జాతీయ రహదారి వెంట దివివారిపాలెం ,చుట్టుగుంట, ఆనందపరం, కొండముడుపాలెం తోపాటు పలు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మాణం చేయాల్సిన అవసరముంది. ముఖ్యంగా కొండముడుసుపాలెం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఉండటం వల్ల రవాణా సౌకర్యానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ రహదారిలో నిత్యం బస్సులు, లారీలు, ఆటోల వంటివి 400 నుంచి 500 తిరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో అక్కడ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముంది.

ప్రయాణికుల భద్రతపై శ్రద్ధ లేదు..

పబ్బిశెట్టి వరదరాజ- ప్రయాణికుడు

ప్రయాణికుల రక్షణ మరిచి పాలకులు, అధికారులు టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలనే దానిపై లేదని కందుకూరు పట్టణానికి చెందిన ప్రయాణికుడు పబ్బిశెట్టి వరదరాజ అభిప్రాయపడ్డారు. జాతీయ రహదారి నిర్మించిన తర్వాత ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోయాయి. దీన్ని దష్టిలో పెట్టుకుని కొండముడుసుపాలెం తోపాటు మిగిలిన గ్రామాలకు వెళ్లే దారుల్లో అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరముందన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడండి..

ఎస్ఎ గౌస్ -సిపిఎం పట్టణ కార్యదర్శి

ప్రజలు, ప్రయాణికుల అవసరాల కోసం కొండముడుసుపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారి వెళ్లే మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చేసినా పాలకులు, అధికారుల చెవికి ఎక్కలేదని సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్ చెప్పారు. ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతే కానీ అధికారులు స్పందించే పరిస్థితి కనిపించట్లేదు. వెంటనే నిర్మించాల్సిన అవసరముందన్నారు.

'జ్ఞానమ్మ'కు ప్రభుత్వం చేయూత..!

పిఎంఇవై 1.0 కింద ఇళ్లు మంజూరు - 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

'బంగారు' జ్ఞానమ్మ బతుకుపోరాటం పేరుతో ప్రజాశక్తితో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వం స్పందించింది. కలెక్టర్ విమాన్షు శుక్లా ఆత్మకూరు ఆర్‌డిఒ, హౌసింగ్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జ్ఞానమ్మకు ఏం చేశారు. ఏం చేయాలి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు హౌసింగ్ డిఎం వేణుగోపాల్‌తో మాట్లాడి అమెకు అవసరమైన ఇంటి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. పిఎంఇవై 1.0 కింద రూ 2.50 లక్షలు మంజూరు చేస్తామని తెలిపినట్లు తెలిసింది. . గురువారమే ఇంటి నిర్మాణం చేపడుతామని కలెక్టర్‌కు తెలిపినట్లు సమాచారం. ఆర్‌డిఒతో డి. పావనితో మాట్లాడి ఇప్పటి వరకు ఏం చేశారు. ఇంకా ఏం చేయాలో అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు జ్ఞానమ్మ కుటుంబానికి చేసిన సాయాన్ని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సిఎం ఆదేశాలను పాటించామని, అనేక సదుపాయాలు చేపట్టామని, మిగిలినవన్నీ పూర్తి చేస్తామని చెప్పినట్లు తెలిసింది. జ్ఞానమ్మ కుటుంబానికి సిఎం హామీ ఇచ్చినవన్నీ పనుల పూర్తి చేయాలని, అధికారులను కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

సిఎం చెప్పినవి చేస్తున్నాం- ఆర్‌డిఒ

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు జ్ఞానమ్మ కుటుంబానికి ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని ఆత్మకూరు ఆర్‌డిఒ డి. పావని తెలిపారు. "ప్రజాశక్తి"కి ఆమె వివరణ ఇచ్చారు. సిఎం చెప్పిన తరువాత ఆమె పిల్లలను మంచి పాఠశాలలో చేర్చడానికి ప్రయత్నం చేశామని, తమ పిల్లలు మా వద్దే ఉండాలని ఆమె తెలిపారన్నారు. జ్ఞానమ్మ, ఆమె భర్తకు ఇద్దరికి ఆత్మకూరు సమీపంలో నెలకి రూ. 18 వేల చొప్పున ప్రయివేటుగా పనిచూశామని, అందుకు వారు సుముఖత వ్యక్తం చేయలేదని పేర్కొన్నారు. మార్గదర్శి నాగేశ్వరావు లక్ష రూపాయలతో 12 మేకలు తీసిచ్చారని, వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం స్థలం ఇచ్చిందన్నారు. గృహనిర్మాణం చేపట్టలేదని వెంటనే నిర్మాణం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. పిల్లలకు ఒక్కొక్కరికి రూ లక్ష ఇన్సూరెన్స్ ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉందని దానిని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. నాగేశ్వరరావు జ్ఞానమ్మ కుటుంబానికి అవసరమైన సాయం అందించడానికి ముందు కొస్తున్నారన్నారు. జ్ఞానమ్మ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు.

జ్ఞానమ్మ

కలెక్టర్, ఎస్‌పిలతో 'వేమిరెడ్డి' భేటి

కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ::నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లాని ఎంపి వేమిరెడ్డి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఎంపి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్తఓ జిల్లా అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను, వాటి నివారణకు చేపట్టాల్సిన అంశాలు, పెండింగ్ విషయాలపై మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఉన్నారు.

ఎస్‌పికి శుభాకాంక్షలు : ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎస్‌పి డాక్టరు అజిత వెజెండ్లని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎస్‌పి గా వచ్చిన డాక్టరు అజిత వెజెండ్ల ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసిన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై మాట్లాడారు.

ఎస్‌పి అజిత వేజండ్లకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కొనసాగుతున్న శరన్నవరాత్రులు

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పెద్ద బజారులో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు ఆలయ అధ్యక్షులు కోట నరసింహం ఆధ్వర్యంలోఎంతో వైభవంగా జరుగుతున్నాయి. నేడు దుర్గాష్టమి సందర్భంగా శ్రీ వాసవి అమ్మవారు భక్తులకు దుర్గామాత రూపంలో దర్శనమిచ్చా రు.అమ్మవారిని కన్నుల పండుగగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు

అంకమ్మతల్లి ఆలయంలో..

అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి రోజున శ్రీ అంకమ్మ తల్లి భక్తులకు దుర్గామాత రూపంలో దర్శనమిచ్చింది. ములుగు సుబ్రహ్మణ్యం శర్మ, చెరుకూరు వంశీకష్ణ, ఎడ్ల లక్ష్మీనరసింహారెడ్డి, ఉప్పుటూరి సుబ్బారావు, నల్లమల్లి శ్రీరామ్మూర్తి,యంపరాల కష్ణారెడ్డి ఉభయ దాతలుగా వ్యవహరించారు.

బుర్రాను కలిసిన పూసాటి జగన్

'బుర్రా'ను కలిసిన 'పూసపాటి'

ప్రజాశక్తి-కందుకూరు :వైసిపి ఐటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి పూసపాటి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా వైసిపి కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గత కొన్ని రోజుల క్రితం బెంగుళూరు, డిల్లీ లలో జరిగిన ఐటీ విభాగంకి సంబంధించిన కార్యక్రమాల గురించి వివరించినట్లు పూసపాటి జగన్ తెలిపారు.ఈ సందర్భంగా పూసపాటి జగన్‌ని బుర్రా మధుసూదన్ అభినందించారు.

ఎస్‌పికి పూల బొకే అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ఎస్‌పికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు :ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం రాత్రి జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన అజిత వేజెండ్లని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరు నియోజకవర్గంలోని శాంతి భద్రతల సమస్యలపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌పితో ఎంఎల్ఎ చర్చించారు.

రాష్ట్రంలో ఐదువేల గుడుల నిర్మాణం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో ఐదువేల గుడులను నిర్మిండానికి నిధులు భక్తుల నుండి వచ్చినవేనని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక మంత్రి వారి క్యాంపు కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని దళిత గిరిజన వాడలలో 5000 గుడులు నిర్మించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో దేవాదాయ శాఖ మనుగడ కోల్పోయిందని మంత్రి ఆనం ఆవేదన వ్యక్తం చేశారు.గతం లో అనేక దేవాలయాల్లో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు జరిగాయని ఉదాహరణకు కొండ బిట్రగుంట వద్ద రథం దగ్ధం చేయడం, ప్రముఖ క్షేత్రం అయినా అంతర్వేదిలో రథం తగలబెట్టడం, నాయుడుపేట లోని ఆంజనేయస్వామి విగ్రహానికి తోకను కత్తిరించడం, విజయవాడ అమ్మవారి దేవస్థానంలో వెండి సింహాలు మాయమవ్వడం, ఇటువంటి సంఘటనలు అనేకం జరిగాయని తెలిపారు. దేవుని రక్షణ, భద్రత లేకుండా ఉండిందని అభిప్రాయపడ్డారు. విజయవాడలో కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా వేల జ్యోతుల కాంతిలో విరాజిల్లుతుందని తెలిపారు. హిందూ ధర్మ మనోభావాలు దెబ్బ తినకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. హిందూ ధర్మంతో పాటు సనాతన ధర్మాన్ని కాపాడే విధంగా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని. దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆ దిశగా చర్యలు చేపట్టారన్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. దూప దీప నైవేద్యాలకై సుమారు 5523 దేవాలయాలకు నెలకు పదివేల రూపాయలు చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని, అదేవిధంగా అర్చకులకు కూడా జీతం పెరుగుదల జరిగిందని తెలిపారు. టిడిపి నాయకులు గిరి నాయుడు, వేమిరెడ్డి విజయబాస్కర్‌రెడ్డి, ఆనం రంగ మయూర్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన రూరల్ ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

19న మంద కృష్ణ రాక

ప్రజాశక్తి - సైదాపురం :ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఈనెల 19న జిల్లాకు రానున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం సైదా పురంలోని డాక్టర్ సి ఆర్ ఆర్ కాలేజీ ప్రాంగణంలో వెంకటగిరి నియోజ కవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆ మూడు మండలాల ఇన్‌ఛార్జి చింతగుంట అంకయ్య మాదిగ అధ్యక్షత వహిం చారు. ముఖ్య అతిథిగా జాతీయ నాయకులు నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జి మంద వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొని మాట్లాడారు. అక్టోబర్19న జరిగే సంఘం అనుబంధ సంఘాల సమీక్ష సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సూరి పాక ఉదయ్ కష్ణ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ, ఎం ఈ ఎఫ్ జిల్లా నాయకులు వేగూరు వెంకటేశ్వరరావు మాదిగ, ఎం ఈ ఎఫ్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఆత్మకూరు శేషు మాదిగ, మండల ఎంఇఎఫ్ అధ్యక్షులు మంగళపూరి చిరంజీవి మాదిగ, సైదాపురం మండల నాయకులు ఎన్ గంగాధర్ మాదిగ ఉన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరులో మట్టి మాఫియా కొనసాగుతోంది. గుడ్లూరులోని పెద్ద చెరువు లో జెసిబి లు ప్రవేశపెట్టి వందలాది ట్రాక్టర్ల ద్వారా ఎర్ర గులక మట్టి విరామం లేకుండా వేలాది ట్రిప్పులు తరలిస్తున్నారు. గత 15 రోజుల కిందట ప్రారంభమైన ఈ మట్టి తరలింపు తాత్కాలింగా ఆగింది. మళీల బుధవారం వేకువ జాము నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు.ఈ అక్రమంగా తరలిస్తున్న మట్టిని ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్న వెంచర్లు చదును చేసేందుకు తరలిస్తున్నారు .సుమారు 8వేల క్యూబిక్ మీటర్ల మట్టి తరలించేందుకు నామమాత్రపు అనుమతులు తీసుకొని 24 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిఇన తరలిస్తున్నారు. సాగునీటి చెరువుల్లో నాణ్యమైన ఎర్ర గులక మట్టి ఉండడంతో గుడ్లూరు పెద్ద చెరువు వద్ద మట్టి తవ్వేందుకు నామమాత్రపుఅనుమతులు తీసుకుంటున్నారు. అదే తడువుగా చెమిడిది పాడు దగ్గర దూలాల చెరువు, అడవి రాజుపాలెం చెరువులో నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేకుండానే ఎర్రగులక మట్టిని తరలిస్తున్నారు. గుడ్లూరులో ప్రభుత్వ కార్యాలయాలు మీదుగా విరామం లేకుండా అక్రమంగామట్టి తరలిస్తున్నారు. అధికారులు చూసి చూడనట్లు ఉండిపోవడంతో మట్టి మాఫియా పరిస్థితి మూడు పువ్వులు.. ఆరు కాయలు ఉన్నట్లుగా ఉందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని వ్యాధుల నివారణపై గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా చేపట్టిన "స్వస్థ నారి-సుశక్తి పరివార్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం కందుకూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో జరిగిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలలో రక్తహీనత అధికంగా కనిపిస్తోందని, దీని నివారణకు ఆరోగ్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి కూడా తీవ్ర స్థాయిలో ప్రబలుతోందని, ప్రతిరోజు మా ఆఫీస్ నుంచి మూడు నుండి నలుగురు క్యాన్సర్ పేషెంట్లకు సిఫార్సు లేఖలు ఇస్తున్నామని, దీన్ని బట్టి పరిస్థితి అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఎన్ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో విస్తతంగా పర్యటించి, ఆరోగ్య సూత్రాలను ప్రజలకు వివరించాలని, హెల్త్ అధికారులు విధిగా ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని చెప్పారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

డయాలసిస్ యూనిట్ సిబ్బందికి హెచ్చరికలు..

ఎంఎల్ఎ ఇంటూరి ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్, నెఫ్రో ప్లస్ ను సందర్శించి, దాని నిర్వహణపై డాక్టర్ శేషారెడ్డిని పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారుఆయన డయాలసిస్ యూనిట్ లో పనిచేసే టెక్నీషియన్లు రోగుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆస్పత్రి అభివద్ధికి సి.ఎస్.ఆర్ నిధులు

కందుకూరు ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి హామీ ఇచ్చారు. ఉలవపాడు మండలం రామాయపట్నం పోర్ట్ పరిధిలో రాబోతున్న భారీ పరిశ్రమల నుండి సి.ఎస్.ఆర్ నిధులు కేటాయించి ఆసుపత్రికి అభివద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో 10 మందికి అలింకో కంపెనీకి చెందిన వినికిడి మిషన్లను ఎమ్మెల్యే అందించారు. ఆపరేషన్ థియేటర్లను కూడా ఆయన పరిశీలించారు. ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ శకుంతల, టిడిపి పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు,ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు, మువ్వల భూషయ్య, మన్నేపల్లి వరప్రసాద్ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు

సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ రెండవ మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు జిల్లాలోని బీడీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీడీ కార్మిక సంఘం రూరల్ కన్వీనర్ షేక్ షబ్బీర్ పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ రెండవ మహాసభను జయప్రదం చేయాలని బీడీ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఆపన్న హస్తం కోసం ఎదురు చూపు..

ప్రజాశక్తి-మర్రిపాడు

రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం. ఎలాంటి ఆస్తులు లేవు. రోజు వారీ కూలి పనులు చేస్తే గానీ పూటగడవదు. వారి జీవితాన్ని విధి పగపట్టింది. ఇంటి యజమాని కిడ్నీవ్యాధి సమస్యతో బాధ పడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. మండలంలోని పెద్ద మాచునూరు గ్రామానికి చెందిన అరిగెల చిన వెంకటయ్య, వెంకటమ్మ దంపతులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. అన్నీ తానై చూసుకోవాల్సిన భర్త అలనా పాలనా భార్య చూడాల్సిన పరిస్థితి. కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని దయనీయ స్థితి. ఉండేందుకు నిలువ నీడ, తినేందుకు సరైన తిండి, కట్టుకునేందుకు దుస్తులు లేవు. కుటుంబంలో అన్నీ బాధలే. పిల్లలు లేరు. వృద్ధ దంపతులను పోషించే వాళ్లు లేక వెంకటమ్మ అక్క కుమారుడు వినోద్ దగ్గర ఉంటున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ భార్యతో కలిసి దుర్భర జీవితం సాగిస్తున్న ఈ కుటుంబానికి ఇప్పటివరకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందలేదు. 70యేళ్ళ వయస్సులో వృద్ధాప్య పింఛన్ కోసం సచివాలయం చుట్టూ తిరిగినా నిరాశే ఎదురైంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబానికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దయగల దాతలు వృద్ధులను పోషిస్తున్న వినోద్ 9701100018 నెంబర్‌కు ఫోన్‌చేసి సహకరించాలని స్థానికులు, బాధితులు వేడుకుంటున్నారు.

జ్యోతి ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : డాక్టర్ జ్యోతి ఆత్మహత్య సంఘటనపై, ప్రత్యేక దర్యాప్తు బృందం చేత విచారణ జరపాలని, రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు కోరారు. స్థానిక జర్నలిస్టు భవన్ (ప్రెస్ క్లబ్)లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల భవనం 4వ అంతస్తు నుంచి దూకి డాక్టర్ జ్యోతి ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. ఆత్మహత్య జరిగిన సంఘటన పై నిజానిజాలు వెలుగు చూసేలా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2024 సంవత్సరంలో ఆమె ప్రభుత్వ డాక్టర్ గా పీహెచ్ సి లో పని పనిచేశారని తెలిపారు. అప్పట్లో డాక్టర్ జ్యోతి ఆత్మ హత్య పై జరిగిన శవ పంచనామా కూడా జరగలేదని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ జ్యోతి మరణం ఆత్మహత్య కాదని, హత్యని ఆరోపణలు ఉన్నాయన్నారు. మాల మహానాడు నాయకులు పాలెటి కోటేశ్వరరావు, గుంటుపూడి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

వయో వృద్ధులను సంరక్షిద్దాం..

ప్రజాశక్తి-కావలి : సమాజంలో వయో వృద్ధుల సంరక్షణ, పోషణ సామాజిక భాధ్యత అని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి కోరారు. అక్టోబర్ 1వ తేదీ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులను గౌరవించడం వారి అనుభవాలను, విజ్ఞానాన్ని సమాజానికి అందించాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. బిడ్డలు వృద్ధులను గౌరవించి ఆదరించాలని కోరారు.

7న ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-కోవూరు : అక్టోబర్ 7వ తేదీన విజయవాడలో ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్త ధర్నా నిర్వహిస్తారని ఫ్యాప్టో నాయకులు తెలియజేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో కోవూరు టి.ఎన్.సి. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో కోకన్వీనర్ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, 12వ పిఆర్‌సి అమలు, మధ్యంతర భృతి, కరువు నియామకాలు, సిపిఎస్ రద్దు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే రాష్ట్రస్థాయి ధర్నాకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హెడ్‌మాస్టర్ వై.వెంకటరామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులను పాఠాలు బోధించే స్వేచ్ఛ కల్పించాలని, బోధేతర పనుల నుండి ముక్తి కలిగించాలని కోరారు. డేవిడ్ చిన్నబాబు మాట్లాడుతూ 2025 బదిలీలలో కొత్తగా ఎంపికైన స్కూలుకు వెళ్లలేని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.కె. జాకీర్ మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. డాక్టర్ ఎస్.డి. జుల్ఫికర్ అలీ అహ్మద్ మాట్లాడుతూ సిపిఎస్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్. వెంకటేశ్వర్లు, బి. శ్రీనివాసులు, కె. నాగిరెడ్డి, బి.వెంకయ్య, ఎం.వి. సుబ్రహ్మణ్యం, రఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో ఆయిల్ కంపెనీల మోసాలను అరికట్టండి..

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కృష్ణపట్నం పోర్టులో పలు ఆయిల్ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నారని, అధికారులు అరికట్టాలని శ్రీకాళహస్తి ఆర్‌డివి సెక్రటరీ యోగానంద్ కోరారు. స్థానిక జర్నలిస్టు భవన్ (ప్రెస్ క్లబ్)లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో తమకు కృష్ణపట్నం పోర్టు ఆయిల్ కంపెనీల పై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ప్రతిరోజూ ఆయిల్ ట్యాంకర్లు లోడింగ్, తక్కువగా ఆయిల్ వస్తుందని తీవ్ర స్థాయిలో ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ట్యాంకర్లలో ఆయిల్ తక్కువగా ఉండటం ట్యాంకర్ల ఓనర్లు ప్రశ్నిస్తే, మీ బ్రోకర్ల ద్వారా మెయిల్ పెట్టండి అని బెదిరిస్తున్నారని ఆరోపించారు. బ్రోకర్లు పలుమార్లు మెయిల్ పెట్టినప్పటికీ పట్టించు కోవడం లేదన్నారు. దీంతో ప్రతి ట్యాంకర్ ఓనర్లు నష్టపోతున్నారని తెలిపారు. తూనికల కొలతల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై ఎవరు పట్టించుకోకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తాను ఈ మోసాలపై సిఎం, డిప్యూటీ సిఎంలకు ఆధారాలతో లేఖ రాశానని తెలిపారు. ఈ మోసాల పై అధికారులు తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

దుర్గాదేవి అలంకారంలో వాసవి కన్యకా పరమేశ్వరి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వృత్తి విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వృత్తి విద్యాకోర్సుల వల్లనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ఒకేషనల్ కోఆర్డినేటర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్న్ షిప్ నిర్వహించారు. పది రోజుల పాటు జరుగుతున్న ఈ ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ మల్లికార్జున సందర్శించారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను మల్లికార్జున అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వృత్తి విద్యా ట్రైనర్ గొల్లపాటి ఎజ్రా, నాగ వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

జయశ్రీ అన్నమాచార్య సంకీర్తన

ప్రజాశక్తి-కావలి : శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీ వాసవి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తదుపరి సాయంత్రం బిట్రగుంట జయశ్రీ బృందం ఆధ్వర్యంలో అన్నమాచార్య, అమ్మవారి సంకీర్తన భక్తి గీతాలతో కార్యక్రమం ఆద్యంతం అలరించింది. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలో వెలసివున్న అనికేపల్లెమ్మ తల్లి గ్రామ దేవత శరన్నవరా త్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ కదురు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రుల మహోత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అసంఖ్యాకంగా తరలొస్తున్నారు. ఈ మహోత్సవాలలో భాగంగా మంగళవారం (9వరోజు) దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజూ ఎమ్మార్ గ్రూప్ అఫ్ కంపెనీ, ఏఎమ్మార్ ఇం డియన్ లిమిటెడ్ కంపెనీస్, ఎస్ఎస్సి కన్స్ట్రక్షన్స్ కంపెనీస్‌పై నిత్యం పూజలు జరుగుతున్నాయి. మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయ పూజారి గంపల పెంచలయ్య ప్రత్యేక పూజలు నిర్వ హించి తీర్థ ప్రసాద వినియోగాలను అందజేస్తున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తోడేడు సుధాకర్, ముత్తుకూరు రవి, తోడేటి రాజా, కొల వపల్లి ప్రసాద్, గంపల వెంకటస్వామి, తోడేటి మధు, కలువాయి వెంకయ్య, కోలపల్లి ప్రతాప్, అన్న సుబ్రహ్మ ణ్యం, తోడేటి శీనయ్య తదితరులు అన్ని వసతులు కల్పిస్తున్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

- ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -నెల్లూరు

ప్రజల ఆరోగ్యానికి నిలయాలుగా ఉండే ప్రభుత్వ వైద్య,ఆరోగ్య కళాశాలలను నిర్వీర్యం చేస్తూ, ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు కాసులు కురిపించే విధంగా ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిపిపి ఆరోగ్య విధానం ఉందని జన విజ్ఞాన వేదిక నగర కమిటీ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయ పడ్డారు. మంగళవారం నగరం లోని టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలోరౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెవివి జిల్లా హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించదలచిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 10 కళాశాలను పబ్లిక్, ప్రయివేట్ పార్టనర్ షిప్ (పిపిపి) విధానం ద్వార ప్రజలకు ఆరోగ్యం, వారి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. 1993 సంవత్సరంలో నాటి ప్రభుత్వం మెడికల్ కళాశాలలో డొనేషన్, క్యాప్టేషన్ ఫీజుల పెట్టే ప్రయత్నం జరిగితే నాడు పోరాటం చేసి,చివరకు రాష్ట్ర ముఖ్య మంత్రినే మార్చే పరిస్థితి వచ్చిందని, గుర్తుచేశారు. దేశంలో కరోనా మహామ్మారీ విజంభించిన సమయాల్లో ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజల్ని ఏవిధంగా కాపాడాయో గుర్తు చేశారు. ఇటువంటి ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాలను రక్షించుకోవడానికి ప్రజల్లో విస్తతంగా అవగాహన కల్పించాలని, కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, హెడ్మాస్టర్ సంఘాల ప్రతినిధులు బుజ్జయ్య, ప్రజాసైన్సు వేదిక గాలి శీనయ్య, నారాయణ, ఉపాధ్యాయ సంఘాల (ఎస్‌టియు) నాయకులు, బహుజన సంఘాల నాయకులు, ప్రజానాట్య మండలి నాయకులు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు డాక్టర్ ఖాదర్ భాషా, నెల్లూరు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎండి రఫీ, జెవివి జిల్లా నాయకులు ఎం.వి.చలపతి, ఏ.విజయ్ కుమార్, విద్యాచరణ్, కృష్ణ, ఎన్. శంకరయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్త

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వాలు సమగ్ర చట్టం చేయాలని ఎపి వ్యకాసం నాయకులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూరు మండలం జనరల్ బాడీ సమావేశం మురగళ్ళ గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య హాజరై మాట్లాడుతూ వ్యవసాయంలో కీలకమైన మార్పులు తీర్చి యాంత్రికరణ రావడంతో వ్యవసాయంలో పనులు లేకపోవడంతో కార్మికులు వ్యవసాయ ఇతర పనులకు వెళుతున్నారని వలసలు వెళుతున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేసి 60 ఏళ్లు పైబడిన వ్యవసాయ కార్మికులకు పెన్షన్ సౌకర్యం వచ్చే విధంగా కేరళ ప్రభుత్వం మాదిరిగా చట్టం చేయాలన్నారు. అలాగే గ్రామీణ పేదల కోసం తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సందర్భంగా అమలు చేసి కూలీలకు రెండు వందల రోజులు పని కల్పించే రూ.600 కనీసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 5వ తేదీన కొడవలూరు మండలం యల్లాయపాళెం గ్రామంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను కూలీలు ఎక్కువమంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మండల కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మంచాల తిరుపాలు కార్యదర్శిగా జి పెంచలయ్యను మరో 8 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి వెంకటేశ్వర్లు, పోలిపోగు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య

వ్యక్తి దారుణహత్య

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ నియోజకవర్గం పరిధిలోని చెముడుగుంట ప్రాంతంలోని ఓ వైన్‌షాప్ సమీపంలో మల్లికార్జున అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి పారిపోయారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలానికి దర్యాప్తు చేస్తున్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ

కార్మికులకు కనీస వేతనం అందజేయాలి

ప్రజాశక్తి-జలదంకి

కార్మికులకు కనీస వేతనం కింద రూ.26వేలు అందజేయాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సురే చెంచురెడ్డి భవనంలో సిఐటియు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బద్దేపూడి సుకన్య అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా సిఐటియు కార్యదర్శి షేక్ రెహానా బేగం మాట్లాడుతూ 8గంటల పని కోసం పోరాడాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలుగా ఇవ్వాలని, సిఐటియు ఆల్ ఇండియా మహాసభ విశాఖపట్నంలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయటానికి కార్మికులందరూ కృషి చేయాలని తెలియజేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.మాల్యాద్రి, మండల కార్యదర్శి ఎం.ఆంథోనీ బాబు, రైతు సంఘం మండల అధ్యక్షులు రావి మాల్యాద్రి, కార్యదర్శి గడ్డం మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐదుగురితోటి నూతన కమిటీని ఎన్నుకున్నారు. బి.సుకన్య కన్వీనర్‌గా, ఓ.పద్మ కోకన్వీనర్‌గా, వి.రాజకుమారి కోశాధికారిగాను ఎన్నికయ్యారు.

చిన్నారులకు నాట్య పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-కావలి

పురస్కారాలు అందుకున్న చిన్నారులు

నెల్లూరు పట్టణం టౌన్ హాల్‌లో శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం వారు అట్టహాసంగా నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమంలో కావలి పట్టణానికి చెందిన సంయుక్త నృత్య కళానిలయం నాట్యగురువు లిఖిత.గంగపట్నం తన శిష్యులు చిన్నారి ఈతముక్కల.క్రిష్ణప్రియ, పామూరు మౌక్తిక సాయిశ్రీ, పామూరు సుగాత్రిక సాయిశ్రీ, చీదెళ్ళ తణన్య, హన్విక, భవిష్య, దాక్షాయణి, శివ తన్మశ్రీలో చేత చేయించిన నృత్య ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం నాట్య గురువు డాక్టర్ డేగల.సాంబశివరావు మాట్లాడుతూ అతిచిన్న వయసులోనే కూచిపూడి నాట్యంలో ఎం.ఎ. చేయడమే కాకుండా సంయుక్త నృత్య కళా నిలయాన్ని ప్రారంభించి కూచిపూడి కళలను, సాంప్రదాయాలను విద్యార్థులకు నేర్పిస్తూ, ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. తన తండ్రి ఒక ఆటో డ్రైవర్‌గా ఉంటూ వేలమందికి సహాయ సహకారాలు అందిస్తూ సమాజానికి ఎనలేని సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. సంయుక్త నృత్య కళానిలయం నాట్యగురువు లిఖిత గంగపట్నం మాట్లాడుతూ తన తండ్రి ఆటో డ్రైవరైనప్పటికీ తనకు ఇష్ట మైన కళను నేర్పించారన్నారు. తాను ఈ స్టేజికి రావడానికి తనతల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని తెలిపారు. తమ సంయుక్త నృత్య కళా నిలయం చిన్నారులకు ఈ చక్కని అవకాశాన్ని కల్పించిన డాక్టర్ డేగల సాంబశివరావుకి ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అనంతరం సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం నాట్యాచార్యులు డాక్టర్ డేగల సాంబశివరావు, తదితర గురువులు చేతులు మీదుగా సంయుక్త నృత్య కళా నిలయం చిన్నారులకు శ్రీ నందికేశ్వర కూచిపూడి నాట్యపురస్కారాలు అందజేశారు.

ఆక్రమణలో జొన్నవాడ ఆలయ భూమి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా జొన్నవాడ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవార్ల దేవస్థానం అలరారుతుంది. ఈ దేవస్థానానికి జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు జొన్నవాడ గ్రామం మొత్తం వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. గ్రామంలోని ఈ భూములను అనాదిగా ఆలయ అర్చకులు, గ్రామస్తులు లీజుల పేరిట తీసుకొని అనుభవిస్తున్నారు. ఆలయానికి ఎదురుగా శంకరమఠం పక్కన ఉన్న 60 సెంట్లు భూమి తోపాటు ఇరిగేషన్ కి సంబంధించిన మొత్తం ఎకరాను ఆలయ అర్చకుడు సాగుపేరిట తనఆధీనంలో ఉంచుకొని అనుభవిస్తున్నాడు. ఆలయానికి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వ్యవహరించిన వారితో వారితో అనుకూలంగా ఉంటూ ఈ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ భూమిని స్థానిక, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకుల సహాయ సహకారాలతో నెల్లూరు నగరానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. ఈ భూమిని కొన్న వ్యక్తి సదరు స్థలంలో ఫ్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న స్థానిక తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు వివాదాస్పద భూమిని సందర్శించారు. దానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అప్పటివరకు భూమి వద్దకు ఎవరు రావద్దని ఆదేశించారు. ఆలయ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఈ విషయమై సంప్రదించగా 193 వ సంవత్సరం నుంచి ఈ భూమి అమ్మవారి ఆలయం పేరిట రిజిస్టరై ఉందన్నారు.ఈ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి బకాయిలను చెల్లించకపోవడంపై కావలి కోర్టులో ఆశ్రయించగా లీజు బకాయిలను రాబట్టుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ వివాదం తమ దృష్టికి వచ్చిందని ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌డిఒ కోర్టులో కేసు పెట్టామని ప్రస్తుతం అది నడుస్తుందని తెలిపారు.

ఆక్రమణలో ఉన్న ఆలయ భూమి

వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సభ్యులు

రెడ్‌క్రాస్‌కు భూరి విరాళం

ప్రజాశక్తి-కావలి

ప్రముఖ వ్యాపారవేత్త, సీనియర్ రొటేరియన్ పచ్చిపులుసు వెంకటేశ్వర రావు రెడ్‌క్రాస్ నూతన భవన సముదాయ నిర్మాణం కోసం రూ.3లక్షల విరాళం ప్రకటించారు. మంగళవారం ఆయన రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌ను సందర్శించి, తలసేమియా బాధిత చిన్నారులకు మందులు, పౌష్టిక ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల మందుల కోసం రూ.10వేలు అందజేశారు. అనంతరం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంపై మొదటి అంతస్తు నిర్మాణ పనుల నిమిత్తం రూ.3లక్షల విరాళం ప్రకటించారు. రెడ్‌క్రాస్ సభ్యులు వెంకన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవిప్రకాష్, కె.హరినారప రెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు, డాక్టర్ పాముూరు శ్రీధర్, కల్లయ్య, కనమర్లపూడి భార్గవ, బిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాత రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-కావలి

ఉపాధ్యాయ, ఉద్యోగ నియామకాల్లో పాత రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయాలని బిసిఇఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసాయి డిగ్రీకళాశాలలో మంగళవారం బి.సి.ఇ.ఎఫ్. ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బి.సి.ఇ.ఎఫ్. నేత వి.మాధవ అధ్యక్షత వహించి మాట్లాడారు. తరతరాలుగా బి.సి.లకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. పాత రిజర్వేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బి.సి.ఇ.ఎఫ్. నేతలు అన్నం. శ్రీను, వాసిలి. సురేష్, తుమ్మా రవి, రత్నం, పి.మాధవ, వై.ప్రభాకర్, పి.చెన్నక్రిష్ణయ్య, నరసింహారావు, రమణయ్య తదితరులు మాట్లాడుతూ బి.సి. ఉద్యోగ, నిరుద్యోగుల హక్కుల సాధనకు ఏర్పడిన రిజిస్టర్ సంఘం బి.సి.ఇ.ఎఫ్. అని వివరించారు. బి.సి.లకు ఎక్కడ అన్యాయం జరిగినా సంఘటితంగా ఎదుర్కొంటామని ఉద్ఘాటించారు. గతంలో బి.సి. సంఘాల మీద చిన్న చూపు ఉండేదని కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. బి.సి. నిరుద్యోగ, ఉద్యోగులకు నష్టం జరిగిన పుడు ప్రశ్నించే పరిస్థితి గతంలో ఉండేది కాదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం యావత్ బి.సి. సమాజం మీద ఉందన్నారు. ఆ దిశగా చైతన్య పరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం జనాభాలో అధిక శాతంగా ఉన్న బి.సి.లు వారికి జరుగుతున్న అన్యాయాలను లోతుగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ రకాల యూనియన్‌లు, ప్రజా సంఘాల నాయకులు, బి.సి. మేధావులు అందరం ఏకమై మనకు జరుగుతున్న అన్యాయాలను సంఘటితంగా పరిష్కరించుకోవాల్సిన ఆవశ్యకతను గూర్చి వివరించారు. గడపగడపకు బి.సి. భావజాలాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు బిసిఇఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వాసిలి సురేష్, ట్రెజరర్ గుమ్మడి వెంకటరత్నం ఆధ్వర్యంలో బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు ఏపూరి ప్రభాకర్, అధ్యక్షులు తుమ్మారవి, ప్రధాన కార్యదర్శి పి.చెన్న క్రిష్ణయ్య, కోశాధికారి ఈ.బాలరాగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.రమణయ్య, ఉపాధ్యక్షులు నరసింహారావు, వెంకటయ్య, తదితరులు సహాయం కార్యదర్శులు వేణు, నాగనరసింహులు, తదితరులు, మహిళా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న నాయకులు

గిరిజనులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : స్థానిక చెరువుకట్ట సంఘంలోని గిరిజనులకు మంగళవారం విజయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిగురుపాటి వెంకట అనిల్‌కుమార్, సాయి కోమలి దంపతుల కుమార్తె చిరంజీవి చిగురుపాటి వెంకట నిధి 6వ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టివిఎస్ ఫౌండేషన్ తోట వెంకటేశ్వర్లు, మీకోసం సేవాసంస్థ దిలీప్‌కుమార్, కొండల రావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు యంగల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

మహిషాసురమర్ధినిగా దుర్గాదేవి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు తిరునాళ్లతిప్ప కాశీనాయన ఆశ్రమంలో దసరా నవరాత్రుల సందర్భంగా 9వరోజు మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భద్రకాళీ సమేత వీర భోగ వసంతరాయుల ఊరేగింపు వైభవంగా సాగింది.

ఎట్టకేలకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జరిపిన పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎపి రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్కు కృష్ణప్రసాద్, కృష్ణమోహన్ అన్నారు. ఈ సందర్భంగా లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం చెబుతున్న అంశాలను పరిగణలోకి తీసుకుంటే ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏమాత్రం అవకాశం లేకుండా కేంద్రాలను మాత్రం ఏర్పాటు చేసినట్లు ఉందన్నారు. రైతులకు గోనె సంచులను ఇవ్వకుండా వాటికి బదులుగా రూ.4లకు పైచిలుకు సొమ్మును ఇస్తామని ప్రకటించారు. కూలీల ఏర్పాటు కూడా లేదు. తేమశాతం 17శాతం మించకుండా ఉండాలన్నారు. ఈ నియమాల ప్రకారం ఎడగారు పంట కాలం వేసవికాలం కాదు పైగా అల్ప పీడనాలతో వాతావరణం పూర్తిగా తేమ నిండి ఉందని, ధాన్యాన్ని ఆరబోసేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవన్నారు. రైతుసంఘాల పోరాట ఫలితంగా ఏర్పాటు చేయడమే తప్ప రైతుకు సహాయపడేందుకు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విషయం అర్థం అవుతుందన్నారు. ఆత్మకూరు మండలం ఆత్మకూరు పట్టణంలోనూ కరటంపాడు మహిమలూరు గ్రామాలలోనూ మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలియజేసిందన్నారు. రైతుసంఘాల పోరాట ఫలితంగా ఏర్పాటు చేయడమే తప్ప రైతుకు సహాయపడేందుకు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విషయం అర్థం అవుతుందన్నారు. ఆత్మకూరు చెరువు కింద సుమారు 1500 నుంచి 2000 ఎకరాల వరి పంటను వేసినట్లు తెలుస్తుంది. ఈ క్రాప్ నమోదు మాత్రం 900 ఎకరాలకు జరిగినట్లు మిగతా విస్తీర్ణానికి ఈ క్రాప్ నమోదు చేయవలసి ఉందని, అనుకూల వాతావరణంలో కష్టపడి ఎరువులు అందక పోరాటం చేసి పండించిన ధాన్యాన్ని సులభంగా విక్రయించేందుకు అనువైన పరిస్థితులు ఏర్పరచాలని రైతులకు అండగా నిలబడాలని ఎపి రైతుసంఘం అధికారులకు విజ్ఞప్తి చేస్తుందన్నారు. ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, మర్రిపాడు తదితర ప్రాంతాలలో కోతలకు మరికొంత సమయం ఉన్నదని ఈ లోపల గోనెసంచులను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి సులభతరంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి దళారులు పుట్టి ఒకటికి రూ.15వేల వంతున కొనుగోలు చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి ఈ దోపిడీ నుంచి రైతులను ఆదుకోవాలని కోరారు.

డిఇఇ ఏడుకొండలు సేవలు ఎనలేనివి..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గత 33యేళ్లుగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో వివిధ హోదాలలో పనిచేసే ఆత్మకూరు పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుమ్మడి ఏడుకొండలు సెప్టెంబర్ 30న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిగర్వి నిరాడంబరుడు క్రమశిక్షణ అంకితభావంతో మూర్తిభవించి వివిధ హోదాలలో వృత్తే దైవంగా భావించి సేవాతత్పరతతో మచ్చలేని వ్యక్తిగా తోటి ఉద్యోగుల మన్ననలు పొంది, ఇవాళ ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి, ఎఇలు వాసు, రామయ్య, ఖాదర్ మస్తాన్, సాంబశివారెడ్డి, హరీష్, సీనియర్ అసిస్టెంట్ షేక్ గౌస్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ సంపూర్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి



ప్రజాశక్తి బిట్రగుంట : దాతల సహకారంతో కొండ బిట్రగుంట గ్రామంలో శ్రీ బిల్వకూటం క్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కావలి ఎంఎల్ఎ దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం కొండబిట్రగుంట లోని బిలకూట క్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాప్రాకారం ప్రహరీ గోడ, కోనేరు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని బ్రహ్మోత్సవాలకు పనులన్నీ పూర్తయ్యేలా చూసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఆయనతో బోగోలు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, కావలి కాలువ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, రావి విజయ్‌యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు, గ్రామస్తులు, భక్తులు ఉన్నారు.

జాతీయ రక్తదాన దినోత్సవం

ప్రజాశక్తి-కావలి : జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏరియా హాస్పిటల్ కావలి నుండి ఐకాన్ సెంటర్ వరకు రక్తదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా హాస్పిటల్ డాక్టర్స్ డాక్టర్ విజయ వాణి, డాక్టర్ ప్రమీల, డాక్టర్ హరిత, డాక్టర్ మౌలాలి, నర్సులు, ఎఎన్ఎంలు ఆశాలు వర్కర్స్, హాస్పటల్ సిబ్బంది, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సాయి విటల్, వి సేవ ఫౌండేషన్ బ్లడ్ మోటివర్ వినయ్ కుమార్, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్టోబర్ 1వ తేదీ జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా కావలి ఏరియా హాస్పిటల్ బ్లడ్ సెంటర్‌లో వి సేవ ఫౌండేషన్ (బ్లడ్ వారియర్స్) కావలి ఏరియా హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులందరూ ముందుకొచ్చి రక్తదాన శిబిరంకు రక్తదానం ఇవ్వాల్సిందిగా కోరుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలు కాపాడుతారని కోరారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. 345/2010

Between:
శ్రీమతి వారణాసి వెంకట సూర్యప్రభ మరియు వగైరాలు **-వాదులు**
AND
శ్రీమతి మలాది భానుమతి మరియు వగైరాలు **-ప్రతివాదులు**

D-11 / 11వ ప్రతివాది: ద్వారా వెంకట శ్రీనివాస్, S/o. లేటు సత్యనారాయణ, పురుషుడు, 54 సం॥లు, ఎంప్లాయి, వాడపల్లి గ్రామం, కొవ్వూరు మండలం.

D-12 / 12వ ప్రతివాది: ద్వారా వెంకటరత్నం, S/o. లేటు సత్యనారాయణ, ఫ్లాట్ నెం.204, వెంకటేశ్వరా కాలనీ, నెల్లూరు, నెల్లూరు జిల్లా.

D-13 / 13వ ప్రతివాది: నీలం నారాయణమ్మ, W/o. శ్రీనివాస్, డో.నెం. 4-17/30, మిలటరీ కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.

ప్రకటన

పై నెంబరు దావా నందు ప్రతివాదులు అయిన D11, D12, D13 అయిన మీకు ఎన్నిసార్లు రిజిష్టర్డు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను దావా సమన్లు పంపించినప్పటికి మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకముగా రిటర్న్ చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా D11, D12, D13 ప్రతివాదులు అయిన మీరు **ది. 10-10-2025వ తేదీన ఉదయం 10.30 ని॥** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.వి.సుబ్బారావు
కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు
ది.22-9-25 సెల్: 9440330449